'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

బీసీలకు బాసటగా కేసీఆర్

జూలూరు గౌరీశంకర్

దేశంలోని శూద్రులు, అతిశూద్రులను దారుణమైన స్థితి నుంచి బయటపడేయటానికి రాజ్యాంగం రక్షణగా నిలబడినప్పటికీ 77 ఏండ్ల స్వతంత్ర భారత్‌లో బీసీల విషయంలో కూడా రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు అసెంబ్లీ, పార్లమెంట్లలోకి పోయే అవకాశాలు లేక బీసీల గోడును పార్లమెంటు వేదిక మీద నేటికీ చాటిచెప్పే స్థితి లేకుండాపోయింది. ఈ కోణం నుంచే తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమాన్ని, తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని చూడాలి.

ఈ నేపథ్యం నుంచే 2014, జూన్ 2 తర్వాత తెలంగాణలో జరిగిన పునర్నిర్మాణంలో బీసీ సామాజిక వర్గాలను అన్నిరంగాల్లోకి నిలిపేందుకు జరిగిన కృషిని లెక్కగట్టాలి. గత పదేండ్లలో బీసీల అభ్యున్నతి కోసం కేసీఆర్ చేసిన కృషిని తొలి ముఖ్యమంత్రిగా ఆయన ఈ వర్గాలను నిలబెట్టేందుకు పడ్డ తపనను అంచనా కట్టి చూడాలి. ఆ కోణంలో విశ్లేషణ చేయకుండా రాజకీయ కోణాల నుంచే గత పదేండ్ల పునర్నిర్మాణాన్ని చూస్తే బీసీలను భ్రమింపజేసినట్టుగానే భావించాలి.

తెలంగాణ రాష్ట్రంలో 2 కోట్ల మంది బీసీలున్నారు. అంటే సగం తెలంగాణ గురించి మాట్లాడాలి. సగం తెలంగాణ సమాజానికి సంబంధించిన విషయంగా బీసీ కులాలను చూసి మాత్రమే పదేండ్ల పునర్నిర్మాణాన్ని చూడాలి. అందులో కేసీఆర్ తక్కువకాలంలో ఆ వర్గాలకు చేసిన కృషిని వెలికితీసి లెక్కగట్టాలి. దేశంలో 77 ఏండ్లుగా బీసీలను బలి పశువులను చేసి, రాజ్యాంగబద్ధంగా ఏ హక్కుల్లేకుండా చేసిన దుర్మార్గమైన చరిత్ర కాంగ్రెస్, బీజేపీలది. అందులో తెలంగాణ మినహాయింపు కాదు. కేవలం పదేండ్ల కాలంలోనే కేసీఆర్ పునర్నిర్మాణాన్ని పరుగులు తీయించే పనులు చేపట్టారు. ఇందులో సగభాగమైన 2 కోట్ల మంది బీసీలను అన్నిరంగాల్లోకి తేవటానికి కింది నుంచి ప్రారంభమైన కృషిని తప్పనిసరిగా అంచనా కట్టిచూడాలి.

తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని నిలుపుకొంటూ తెలంగాణను తీర్చిదిద్దుకునే క్రమంలో బాగా చితికిపోయిన గ్రామాన్ని బతికించాలి. గ్రామం పచ్చబడటమంటే మొత్తం గ్రామీణ తెలంగాణ రూపురేఖలు మారాలి. ఉత్పత్తి కులాలు గ్రామంతో ముడిపడి ఉన్నాయి. గ్రామం పచ్చబడితేనే, ఊరు ఊపిరి తీసుకుంటేనే బీసీల పొయ్యిలు రాజుకుంటాయి. బీసీలు బతుకటానికి, నిలవటానికి ఆసరా లేకుండా పోయిన భయంకరమైన దుస్థితిలో ఉన్న తెలంగాణను తీర్చిదిద్దుకోవటం కోణం నుంచి తెలంగాణ పునర్నిర్మాణాన్ని అంచనా కట్టి కేసీఆర్ కృషిని అంచనా వేస్తే ఏం జరిగిందో అవగతమవుతుంది. అధికార పీఠాల మార్పిడి కోసం ఇప్పటికీ చేస్తున్న వ్యక్తిగత విమర్శలు, అందుకు కొన్ని పడిగట్టు పదాలను పట్టుకొని విమర్శల మంటలు లేపుతున్నారు. ఆ రాజకీయ విమర్శల కోణంలో కొన సాగుతూ పదేండ్ల పాలనకు గంతలు కట్టి చూస్తే పునర్నిర్మాణ దశలో జరిగిన కృషిని అంచనా వేయలేరు.

ఇంత తక్కువ కాలంలో ఇంతగా తెలంగాణను అభివృద్ధి చేసింది మాత్రం కేసీఆరేనని మాత్రం ఒప్పుకొని తీరాల్సిందే. ఇప్పుడు గాంభీర్యంగా రాజకీయ విమర్శలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలే బీసీలను అత్యంత దారుణంగా అణగదొక్కాయి. దాని నుంచి బీసీలను బైటకు తేవటానికి పదేండ్ల తక్కువ కాలంలో బీసీల అస్తిత్వం దగ్గరికి పోయి కేసీఆర్ మొదలుపెట్టిన కృషి ఆహ్వానించదగినది. బీసీలను వెనుకబాటుతనం నుంచి బైట పడేయడమనేది ఒకరోజులో జరిగే పనికాదు. అందుకు కొంతకాలం మిషనరీగా పనిచేయాలి. ఆ పనిని బీఆర్ఎస్ మొదలుపెట్టింది.

వలసలను ఆపిన చరిత్ర బీఆర్ఎస్‌ది. బతుకుదెరువు కోసం తెలంగాణ నుంచి భారీగా వలసలు పోయారు. 'ముంబయి, బొగ్గుబాయి, దుబాయి'కి తెలంగాణ బిడ్డలు వలసలు పోయే దుస్థితి భయంకరమైనదని ఉద్యమ సమయంలో కేసీఆర్ పదే పదే చెప్పారు. రాష్ట్ర అవతరణ తర్వాత వలసలు పోకుండా చేసేపని మొదలైంది. ఒకరకంగా వలసలు పోయినవారు తిరిగొచ్చే స్థితి వచ్చింది. వలసలు పోయిన కూలీలు తిరిగి గ్రామాలకు వచ్చి వ్యవసాయం చేసుకునే దశ వచ్చింది. చెరువులు నిండటం, కాళేశ్వరం జలాలు 250 కిలోమీటర్లు ప్రయాణం చేసి మారుమూల, చివరి గ్రామాలకు చెరువులను నింపడంతో పల్లెలు పచ్చబడ్డాయి. వలసలు ఆగాయి. ఇక్కడే ఒక ముఖ్య విషయాన్ని గమనించాలి. ఈ వలసలు పోయిన వారంతా బీసీలేనని గుర్తించాలి. ఇందుకు సంబంధించిన గణాంకాలు తీసి చూస్తే నిజం బయటపడుతుంది. ఉత్పత్తి కులాలకు చెందిన బీసీలంతా చేతివృత్తులు చితికిపోయి పొట్టచేత పట్టుకొని పట్నం బాట పట్టారు. ఈ పనిని తెలంగాణ రాకముందు ఏలిన ఏలికలు పట్టించుకొని ఉంటే ఊరు వలసపోయేది కాదు. చేతివృత్తులు చితికిపోయేవి కావు. గ్రామీణ తెలంగాణ బాగుపడితే సగభాగంగా ఉన్న బీసీల బతుకులు బాగు పడతాయన్న ఆలోచన చేసిన ప్రభుత్వంగా ఆ దిశగా అడుగులు వేసి దారులు వేసింది మాత్రం తొలి తెలంగాణ ప్రభుత్వమేనని ఘంటాపథంగా చెప్పవచ్చు.

బీసీ కులాలు నిలదొక్కుకునేందుకు ఆసరాగా బర్లు, గొర్ల పంపిణీ, గీత, చేనేత, మత్స్యకార్మికులకు ప్రమాద బీమా, కల్లు దుకాణాల పునరుద్ధరణ, నేతన్నకు చేయూత, సెలూన్లకు ఉచిత విద్యుత్తు, ఆధునిక లాండ్రీలు, ధోబీఘాట్ల నిర్మాణం వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఇవన్నీ బీసీ కులాలకు ఆసరా అయ్యాయి. మాంసం, మత్స్య, పాడి పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ఇట్లా అనేకానేక పథకాలు బీసీలు తమ కాళ్లపై తాము నిలబడేలా ఉపయోగపడ్డాయి.

గురుకులాలు రేపటి సామాజిక మార్పునకు కేంద్రాలు: బీసీలు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారని అందరూ చెప్పున్నారు. వీళ్లు ఎదగాలంటే జ్ఞాన పునాది బలంగా ఉండాలి. బీసీలు బాగా చదువుకోవాలి. నాణ్యమైన విద్య అందాలి. తెలంగాణ రాకముందు సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ అంటే పురుగులన్నం పెట్టే కంచాలుగా మారాయి. ఆర్.కృష్ణయ్య తన జీవితంలో సగభాగాన్ని సోషల్ వెల్ఫేర్ హాస్టల్ బాగు కోసమే వెచ్చించారు. ఈ స్థితి మారాలనే తలంపుతో గురుకులాలను కార్పొరేట్ విద్యనందించే స్థాయికి తీసుకుపోయిన ఖ్యాతి కేసీఆర్‌కు దక్కుతుంది. ఇప్పుడు 10వ తరగతి, ఇంటర్‌లలో మంచి ర్యాంకులను గురుకులాల విద్యార్థులు పొందే స్థాయికి వచ్చారు. దేశంలో ఎక్కడాలేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటుచేసింది. ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మా విద్యారంగాల్లోకి గురుకులాల విద్యార్థులు భారీగా వెళ్తున్నారు. ఇవి బడుగుల కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మార్చుతాయి. ఇప్పుడు తెలంగాణ గురుకులాల నుంచి రాబోయే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలు రేపటి సివిల్ సర్వీస్ పరీక్షల్లో నెగ్గే దశకు వచ్చి తీరుతారు. సాఫ్ట్‌వేర్ రంగాలను ఆక్రమించేస్తారు. బడుగులు కూడా అన్ని రంగాల్లోకి తమ బిడ్డలు ఎదగాలని కోరుకుంటారు. అందుకు తొలి తెలంగాణ ప్రభుత్వంలో దారులు పడ్డాయి.

బీసీలకు ఆత్మగౌరవ భవనాలు: హైదరాబాద్ నగరంలో 47 బీసీ కులాలకు అత్యంత విలువైన స్థలాలను కేసీఆర్ ప్రభుత్వం కేటాయించింది. ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు పూనుకున్నది. ఇవి బీసీ కులాల అభ్యున్నతికి, వారి పురోభివృద్ధికి పరిశోధనా కేంద్రాలుగా నిలవాలన్న దీర్ఘకాలిక తలంపుతో కేసీఆర్ ఈ పనికి పూనుకున్నారు. బీసీలు తమ బిడ్డల చదువులు, తమ కులవృత్తుల ఆధునీకరణలు, అన్నిరంగాల్లోకి తమ బిడ్డలు వెళ్లేందుకు ఆలోచనా కేంద్రాలుగా మలచుకునేందుకు బీసీల ఆత్మగౌరవ భవనాలకు స్థలాలిచ్చి ప్రభుత్వమే భవన నిర్మాణాలకు పూనుకున్నది. దేశంలో ఏ రాష్ట్రంలో ఇలా బీసీలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించలేదు.

బీసీ కులాలు నిలదొక్కుకునే పథకాలు: బీసీ కులాలు నిలదొక్కుకునేందుకు ఆసరాగా బర్లు, గొర్ల పంపిణీ, గీత, చేనేత, మత్స్యకార్మికులకు ప్రమాద బీమా, కల్లు దుకాణాల పునరుద్ధరణ, నేతన్నకు చేయూత, సెలూన్లకు ఉచిత విద్యుత్తు, ఆధునిక లాండ్రీలు, ధోబీఘాట్ల నిర్మాణం వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఇవన్నీ బీసీ కులాలకు ఆసరా అయ్యాయి. మాంసం, మత్స్య, పాడి పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.ఇట్లా అనేకానేక పథకాలు బీసీలు తమ కాళ్లపై తాము నిలబడేలా ఉపయోగపడ్డాయి.తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోయింది. దాన్నెవ్వరూ కాదనలేరు. గత పదేండ్లలో జరిగిన అభివృద్ధిని మరిచిపోయి పునర్నిర్మాణానికి గంతలు కట్టి ఏదైనా మాట్లాడుతామంటే తెలంగాణ సమాజం ఒప్పుకోదు.

మరోసారి ఎడారి ముద్రలు

లిప్త కాలంలో
ఒక దశాబ్దం కరిగిపోయింది
అల్లుకున్న ఆకుపచ్చని స్వప్నం
మంచు ముద్దలా కరిగిపోయింది
ఎవరి దిష్టి తగిలిందో
అర్ధాంతరంగా ఆగిపోయింది!

తడి ఆరని నేల మీద
ఎడారి ముద్రలు మళ్లీ విచ్చుకుంటున్నవి
వలస పీడకల
పునరుత్థానం పొంది
రైతు వెన్నులో వణుకు పుట్టిస్తున్నది!

అంతరించి పోయిందనుకున్న
చీకటి వారసత్వం
జడలు విప్పుకొంటున్న దృశ్యం
అనుకున్నట్లే జరుగుతున్నదా
నవ్వేలోని ముంగల జారిపడ్డామా?

అయిదేండ్ల వీలునామా రాసిచ్చి
విలపిస్తున్న దృశ్యాలు కలవరపెడుతున్నాయి!
లోయలో బతుకులు జారిపడ్డాక
ఎవరు ఎవర్ని ఉద్ధరిస్తారు?
ప్రగల్భాలకు పదునుపెట్టి
ప్రలోభపెట్టిన మాట నిజం
సంక్షేమం ముసుగులో
సంక్షోభం వెంటాడుతున్నది!

పాము చిన్నదే కదా అని వదిలేశాక
కర్ర వెతుక్కునేలోపు కాటేసింది!
మరోసారి కప్పం కట్టే సంప్రదాయం
తెరమీదకు వస్తుంటే
పొడుస్తున్న పొద్దు మీద
నడుస్తున్న కాలమా
పోరు తెలంగాణమా!!

సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీ మంత్రి

ప్రశ్నకు పట్టం తెలంగాణ భద్రం

తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసినప్పటికీ ఇంకా ఎన్నికల వేడి తగ్గలేదు. రాష్ట్ర శాసనసభలోని సుమారుగా మూడింట ఒక వంతు అంటే 34 అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రభావితం చేసే వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోరు ఇంకా మిగిలే ఉండటమే అందుకు కారణం.

పిన్నింటి విజయ్‌కుమార్
90520 39109

రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఈ ఉప ఎన్నిక బరిలో ఉన్నప్పటికీ అసలైన పోరు మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి పోటీ పడుతున్న చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న మధ్యేనన్నది జగమెరిగిన సత్యం. ఐదు నెలల తమ పాలననే రెఫరెండమని పేర్కొంటూ పార్లమెంట్ ఎన్నికల్లో తీర్పును కోరిన కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లోనూ పాత పాటే పాడుతున్నది. గులాబీ కంచుకోటను కైవసం చేసుకోవాలనే ఏకైక లక్ష్యంతో ఓ గాడిదలా తీన్మార్ మల్లన్న ప్రచార భారమంతా మోస్తున్నది. 2021లో జరిగిన సాధారణ ఎన్నికల్లో అప్పటి కేసీఆర్ సర్కార్‌ను లక్ష్యంగా చేసుకొని ముప్పేట దాడి చేస్తూ.. ప్రశ్నించే గొంతుక పేరిట విషం చిమ్మిన మల్లన్నను పట్టభద్రులు ఆనాడే తిరస్కరించారు.

పెద్దల సభ గౌరవాన్ని తగ్గించే కుట్రకు కాంగ్రెస్ తెరలేపింది. 'నేను ఇచ్చిందే నినాదం.. నేను చెప్పిందే విధానం' అంటూ నయా నయింగా చెలామణి అవుతున్న స్వయం ప్రకటిత మేధావి మల్లన్నకు టిక్కెట్ కేటాయించి పెద్దల సభ గౌరవాన్ని ఆ పార్టీ మంట కలిపింది. తులసి వనంలోకి గంజాయి మొక్కను పంపాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి పట్టభద్రులు బుద్ధిచెప్పాలి.

పెద్దల సభకు ఎంతో ఘనమైన చరిత్ర ఉన్నది. వివిధ రంగాలకు చెందిన మేధావులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో పార్లమెంట్‌లో రాజ్యసభను, రాష్ట్ర అసెంబ్లీలలో శాసనమండలిని రాజ్యాంగకర్తలు ఏర్పాటుచేశారు. అందుకనుగుణంగా గతంలో చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, కపిలవాయి దిలీప్ కుమార్, రామచందర్‌రావు లాంటి మేధావులు శాసనమండలికి ప్రాతినిధ్యం వహించారు. కానీ, గొప్ప ఆశయంతో ఏర్పాటైన ఈ సభలు రాజకీయ పార్టీలకు పునరావాస కేంద్రాలుగా మారిపోతుండటం శోచనీయం. ఎందరో మహానుభావులు అడుగిడిన సభకు ఒక యూ ట్యూబ్ చానల్ ద్వారా బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడే వ్యక్తిని కాంగ్రెస్ పోటీలో నిలిపి ఈ విష సంస్కృతిని మరింత ముందుకుతీసుకెళ్లాలని చూస్తున్నది. పట్టభద్రులైన మేధావులు విజ్ఞతను ప్రదర్శించాలి. పెద్దల సభకు గద్దలను రానీయకుండా అడ్డుకోవాలి.

'నిజం గడపదాటేలోపే అబద్ధం ప్రపంచాన్ని చుట్టేస్తుంది' అని పెద్దలంటారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, కేసీఆర్‌పై వ్యక్తిగతంగా దాడిచేసిన తీన్మార్ మల్లన్న సరిగ్గా అదే పని చేశారు. విష ప్రచారం చేస్తూ నాటి సంక్షేమ సర్కార్‌పై బురదజల్లారు. ఆ అబద్ధపు ప్రచారాలను నమ్మిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు పేరుతో గద్దనెక్కిన కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది. ప్రజలను కష్టాలపాలు చేసింది. ప్రశ్నించే గొంతుకగా చెలామణిలో ఉన్న మల్లన్న ఏ వేదిక ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిండో పట్టభద్రులు ఆలోచించాలి. ముఖ్యంగా జాబ్ క్యాలెండర్, పరీక్ష ఫీజు లేకుండా దరఖాస్తుల స్వీకరణ, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా, గురుకుల ఉద్యోగార్థుల సమస్యల గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదన్న విషయాన్ని పట్టభద్ర సోదరులు పరిగణన లోకి తీసుకోవాలి.

ప్రశ్నించడం పక్కనపెడితే తన యూట్యూబ్ చానల్ ద్వారా రైతులపై తీన్మార్ మల్లన్న అక్కసు వెళ్లగక్కారు. 'రైతుబంధు వేయలేదని ఎవరైనా అడిగితే చెప్పుతో కొడతా' అని అన్నదాతలను అవమానించారు. అలాంటి వ్యక్తి పట్టభద్రుల ఎమ్మెల్సీగా అర్హుడా? యూట్యూబ్ చానల్ వీక్షణల కోసం బాధిత వర్గాల కష్టాలను ఆసరాగా చేసుకుని అంగీలాగు సిద్ధాంతం నుంచి విలాసవంతమైన జీవితం గడిపే స్థాయికి ఎలా ఎదిగారనేది పట్టభద్రులు, మేధావులకు ఎప్పుడో అవగతమైంది.

ఇది గ్రహించిన మల్లన్న 'ఓటేసి గెలిపిస్తే ఎమ్మెల్సీగా శాసన మండలికి పోతా.. ఓడిస్తే శ్మశానానికి పోత'నని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మొదలుపెట్టాడు. అందుకే కుటిల రాజకీయాలు చేస్తున్న మల్లన్న అవకాశవాదాన్ని తిప్పికొట్టాలి. 'ఎమ్మెల్సీగా గెలిపిస్తే నా గౌరవ వేతనంతో విద్యార్థులు, నిరుద్యోగుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తా'నని చెప్పున్న ఉన్నత విద్యావంతుడు, రైతు బిడ్డ ఏనుగుల రాకేష్‌రెడ్డికి పట్టం కట్టాల్సిన అవసరం ఉన్నది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ రాజకీయ అవసరాలకు తెలంగాణను వాడుకుంటాయే తప్ప రాష్ట్రాన్ని బాగుచేయవు. ఆ పార్టీలకు తెలంగాణ పట్ల ప్రత్యేకమైన అభిమానం ఏమీ ఉండదు. బీఆర్ఎస్, తెలంగాణది వేగు బంధం. అందుకే తెలంగాణ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని, సమస్యలను పరిష్కరించేవారినే ఎన్నుకుందాం. పట్టభద్రులుగా విజ్ఞతను చాటుకుందాం.

విశ్వవిద్యాలయ ఆచార్యులలో మహా మహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి (1943-2023) విలక్షణ పాండిత్య సముపార్జితులు. పాణినీయ అష్టాధ్యాయి లాంటి కఠిన వ్యాకరణ గ్రంథానికి దాదాపు 2 వేల పేజీలలో వ్యాఖ్యానం సమకూర్చి వ్యాకరణాధ్యయనాన్ని సులభతరం చేసిన వైయాకరణి. మూడు పదుల వయసులోనే వ్యాకరణ పదకోశ నిర్మాణం చేయడం అసామాన్యం.

అపర పతంజలి రవ్వా శ్రీహరి

ఆచార్య పిల్లలమర్రి శ్రీరాములు

శ్రీహరి నిఘంటువు, సంకేత పదకోశం, అన్నమయ్య పదకోశం, నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం లాంటి విశేష నిఘంటు నిర్మాణాలతో తమ అసాధారణ పాండితీగరిమను ప్రదర్శించిన సాహితీమూర్తి ఆచార్య రవ్వా శ్రీహరి. వారి సంస్కృతాంధ్ర సాహిత్యాధ్యయనం చాలా యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన. నాటి ఉమ్మడి నల్లగొండ జిల్లా మొత్తానికి ఉన్నత పాఠశాలలు మూడు మాత్రమే ఉండేవి. చదువుకోవడమే అపురూపమైన ఆ రోజుల్లో ఉర్దూ మీడియం పాఠశాలలే ఎక్కువగా ఉండేవి. తెలుగు మీడియం పాఠశాలలు అప్పుడప్పుడే ఏర్పాటవుతున్నాయి. ఆ పరిస్థితిలో నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించిన శ్రీహరి.. ఉచిత భోజన వసతి లభిస్తుందన్న ఆశతో యాదగిరిగుట్ట లోని సంస్కృత పాఠశాలలో చేరారు. నాడు వారి కుటుంబంలో గానీ, బంధువర్గంలో గానీ పెద్దగా చదువుకున్నవారు లేరు. సంస్కృతం నేర్చుకోవాలన్న భావన ఊహకందని విషయం. పదేండ్ల పసి ప్రాయంలో ఉన్నప్పుడే మాతృమూర్తి రవ్వా వెంకట నరసమ్మ అనంత లోకాలకు వెళ్లిపోవడంతో దిక్కుతోచని ఆ స్థితిలో యాదగిరీశుడే దిక్కయ్యాడు. ఆ పసి వయసులో మూడు నెలల్లో కొన్ని శబ్దాలు, ధాతువులు నేర్చి, పరీక్ష పెట్టడం, ఉత్తీర్ణత సాధించకపోతే ఇంటికి పంపిస్తామని చెప్పగా.. అప్పటివరకు నేర్పిన శబ్దాలను నిత్య సాధన చేసి అక్కడే చదువు కోవడానికి స్థిరమైన అవకాశాన్ని పొందిన ప్రతిభాశాలి శ్రీహరి. నాడు సంస్కృతం నేర్పిన అధ్యాపకుల చలవ వల్లనో, చదువుకోకపోతే ఇంటికి వెళ్లి కులవృత్తిలో మగ్గిపోవలసి వస్తుందన్న భయం వల్లనో, చదువుకోవడం వల్లనే చనిపోయిన తల్లి సంతోషపడుతుందన్న స్మరణ వల్లనో గానీ శ్రీహరికి చదువే జీవితమైంది. నాంపల్లి సీతారాంబాగ్‌లోని సంస్కృత కళాశాలలో చేరిన నాటి నుంచి బీవోఎల్ పూర్తయ్యేంత వరకు సంస్కృతాధ్యయనం నిత్య ధ్యాసమైంది. ఒకవైపు చదువుకుంటూనే సంస్కృతం ట్యూషన్ చెప్పేవారు. తద్వారా ఆర్థిక కష్టాల నుంచి కొంతవరకు గట్టెక్కారు. అనంతరం వివేక వర్ధని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఆయన ప్రస్థానం ప్రారంభమైంది. ఆ తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తులో కొంతకాలం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా ఉద్యోగ ప్రస్థానం కొనసాగింది. అధ్యాపకుడిగా కొనసాగడం ఆయన జీవితంలో ఒక పార్శ్వం మాత్రమే. నిత్య పరిశోధకుడిగా, అనువాదకుడిగా, నిఘంటుకర్తగా శ్రీహరి చేసిన కృషి ఆయనను అత్యున్నత శిఖరాలకు చేర్చింది.

నిరంతరం సంస్కృత అధ్యయన అధ్యాపనాల్లో జీవించే పండితులకు మాండలిక పదాలపై మనసు పోవడం చాలా అరుదు. వ్యాకరణం, తర్కం, మీమాంస లాంటి అంశాలను అధ్యయనం చేసేవారికి కావ్యాధ్యాయనమే చాలా అల్పమైంది. అందులోనూ మాండలిక పదాలను గురించిన అంశం గాని, అటువంటి పదకోశాలను రూపొందించడం గాని గౌరవప్రదమైనది కాదు. అటువంటి స్థితికి భిన్నంగా నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం రూపొందించి సామాన్య ప్రజానీకం ఉపయోగించే పదజాలం పట్ల అచంచలమైన గౌరవాన్ని ఆయన ప్రదర్శించారు.

భాస్కర రామాయణం విమర్శనాత్మక పరిశీలన అనే అంశంపై ఆచార్య బిరుదురాజు రామరాజు వద్ద శ్రీహరి పీహెచ్‌డీ చేశారు. 70వ దశకం నాటికి భాస్కర రామాయణానికి సంబంధించిన అనేక తాళపత్ర గ్రంథాలను, ముద్రిత ప్రతులను పరిశీలించి సిద్ధాంత వ్యాసరచన చేశారు. ఆ నాటి కి విశ్వవిద్యాలయాల్లో ఆయా సాహితీ ప్రక్రియలోని పరిణామాలను అధ్యయనం చేసే సంప్రదాయం కొనసాగుతున్న కాలంలో రామాయణంపై పరిశోధన జరిపి పీహెచ్‌డీ పొందారు. వారి గురువు ఆచార్య బిరుదు రాజు రామరాజు ప్రోత్సాహంతో ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకుడిగా ఆ వృత్తికి విశిష్ట గౌరవాన్ని కల్పించారు. అనేక కావ్యాలను పరిశీలించి కవులు ఎటువంటి మాండలిక పదాలను తమ కావ్యాల్లో ఉపయోగించారో ప్రాచీన కావ్యాలను పరిశీలించి వాటిలోని విశేషాలను అందించారు. పాండురంగ మహత్యం కావ్యంలో ఏతులబోవు అనే శబ్దం ఉపయోగించారని మనం ఊహించలేం. ఆయన ప్రయోగం చూపించేంతవరకు 'ఏతులబోవుచున్ విరుగునిప్పటి మంత్రుల' అనే పద్యపాదం గుర్తించడం ఎంత కష్టం. అలాగే 'పెండ ఎత్తునట్టి ముండకిచ్చి' అనే భావనను సింహాసన ద్వాత్రింశికా కర్త ప్రయోగించాడని మనం ఊహించడం సాధ్యం కాదు. ఎన్నెన్నో మాండలిక పదాలను పూర్వ కవులు ఉపయోగించారని, అందువల్ల అన్ని శబ్దాలకు కావ్య ప్రయోగార్హత ఉందని, ఏ శబ్దాన్ని నీచ శబ్దంగా పరిగణించడానికి వీల్లేదని విశదపరిచారు. ఇటువంటి పరిశోధనా వ్యసని కావ్యాను వాదశీలి కావడం అత్యంత అరుదు.

వేమన పద్యాలను, ధర్మపురి శేషప్ప కవి నరసింహ శతకాన్ని, సినారె ప్రపంచ పదులను శ్రీహరి సంస్కృతీకరించారు. జాషువా ఫిరదౌసి కావ్యాన్ని, గబ్బిలాన్ని సంస్కృతీకరించి అంటరాని వ్యక్తి ఆవేదనను అమర భాషలో వినిపిస్తే తప్ప అమరులకు అర్థం కాదని గబ్బిలాన్ని 'తైలపాయికా' చేశారు.

'నరుని కష్టపెట్టి నారాయణుని గొలుచు' అన్న పద్యాన్ని ఇలా అనువదించారు...
మానవం ప్రబాధ్య మాధవం త్వర్చద్ధి
రాస్థితే తు ధర్మభాగ్బిరిహ చ
భూతలే క్షమా పదం న్యస్తుమేవైవ
తైలపాయికా దివం ప్రయాతి
జాషువా ఈ పద్యాన్ని ఆటవెలదిలో రచిస్తే అదే ఛందంలో సంస్కృతీకరించారు శ్రీహరి.

సంస్కృతంలో లేనివైనా అచ్చతెనుగు ఆటవెలది, తేటగీతి సీస పద్యాలను సంస్కృతీకరించి తమ ప్రయోగ దక్షతను ప్రదర్శించారు. అధ్యయన అధ్యాపనలకు భిన్నంగా శాఖ అధ్యక్షులుగా, ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా స్వచ్ఛమైన పరిపాలన అందించారు. పాలనాపరమైన బాధ్యతలు ఎన్ని నిర్వహించినా అధ్యాపనమే గొప్ప ఆనందంగా భావించి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా ఉన్న కాలంలో కూడా వ్యాకరణం బోధించిన ఉత్తమ అధ్యాపకులు. జీవన చరమాంకంలో కూడా పరిశోధనా శీలంతో తూము రామదాస కవి పద్య నిఘంటువుకు అకారాద్యనుక్రమణిక సంతరించిన నిత్య చైతన్యశీలి శ్రీహరి.

అటువంటి విశిష్ట సాహితీ మూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా మిత్రులు, శిష్యులు, సాహితీ ప్రియులు, కుటుంబ సభ్యులు కలిసి ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ ఏర్పాటు చేశారు. సంస్కృతాంధ్రాలలో విశేష కృషి చేసిన సాహితీవేత్తలకు జీవన సాఫల్య పురస్కారాలు అందించాలన్న సంకల్పంతో, ఆ రంగాలలో సేవలందించిన ఆచార్య శలాక రఘునాథ శర్మకు, బహు భాషలు నేర్చి తెలంగాణ నిఘంటువును కూర్చి, కావ్య సృజనలో తమదైన ముద్రవేసిన నలిమెల భాస్కర్‌కు పురస్కారాలు అందిస్తున్నందుకు ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ ఆనందిస్తున్నది. సంస్కృతం నేర్చుకుంటున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నది.

పురస్కార ప్రదానోత్సవం

ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో మహామహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమం జరుగనున్నది. పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానుండగా.. తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ప్రొఫెసర్ కె.యాదగిరి సభాధ